# పిచ్చిమనుషులు



మా ఇంటికి ఎదురుగా ఓ డాక్టరున్నాడు. మా వీధిలో ఇద్దరు ముగ్గురు డాక్టర్లున్నారు. మా ఊళ్ళో చాలామంది డాక్టర్లు ఉన్నారు.

మా ఊళ్ళో ఉన్న డాక్టర్లకు అందరికీ నాలుగు చేతులు!

ముంతకు చెవులున్నంత వింతగా ఆశ్చర్యపడుతున్నారా? ఆ అవసరం లేదు. పుట్టుకవరకు అందరికున్నట్లు మా ఊళ్ళో డాక్టర్లకు కూడా రెండేసి చేతులే! అయితే సంపాదన దగ్గరికి వచ్చేసరికి నాలుగు చేతులు!!

పిచ్చి మనుషులు! ఆపదలోవున్న వాళ్ళ బలహీనతలపై బలప్రదర్శన జరిపే వైద్యో నారాయణోహరులు! నిజానికి ఈదేహాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో రోగాలతో వృత్తి ధర్మమైనా పోరాడి పోరాడి విసుగు.... ప్రాణదానం చేయాలన్న ప్రయత్నం విఫలమైతే నిట్టూర్పులు నిత్యం అనుభవానికి వస్తున్న డాక్టర్లకు బతుకుమీద ఒక అవగాహన కలగాలి. ఆ మాత్రం ఆలోచించలేకుండా రోగుల డబ్బుతో భోగాలనుభవించడం పిచ్చితనం కాక మరేమవుతుంది?

అందుకే ఆసుపత్రిలో జీతగాడి వేషంలో రెండు ఇంట్లో సొంతగాడి వేషంలో రెండు వెరశి వాళ్ళకు నాలుగు చేతులు సంపాదన విషయానికి వచ్చేసరికి! అలా మగడు ఇద్దరు డాక్టర్లయితే నాలుగు నాలుగు ఎనిమిది చేతులు!

అయితే మా ఎదురింటి డాక్టరుగారికి మాత్రం రెండే చేతులు. అభ్యుదయభావాలు కలిగిన ఆ డాక్టరు మంచి మనిషి. చేసేది చేయగలిగేది ఏదో ఆ రోగి నారాయణసేవ ఆసుపత్రిలోనే రెండు చేతులకే పరిమితం చేసుకొన్నాడు. అందువల్ల అతని ఇల్లు ఉదయం కానీ సాయంత్రం కానీ ప్రశాంతంగా ఉంటుంది.

మా ఇంటి పక్కన ఓ పండ్లమండీ ఉంది. దానిని చూసి మరొకటి మా ఇంటికి కాస్త దిగువగా వెలిసింది. ఈ రెండింటిని చూసి వరసగా మూడు...నాలుగు...ఒక్కదాని తర్వాత మరొక్కటిగా పండ్లమండీలు. మా బండ్లవీధిలో వెలిసి దాన్ని కాస్త పండ్లవీధిగా మార్చాయి.

మా వీధికిటువైపు అటువైపు పెద్ద పెద్ద సిమెంటు కాలువలున్నాయి. అవి మురుగు కాలువలు. ఒక్కొక్కటి మొలలోతుకు పైగా ఉంటాయి.

పండ్లమండీల ప్రబుద్ధులు కుళ్ళిపోయిన చెడిపోయిన పండ్లను నేర్పుగా ఆ కాలువల్లో కుమ్మరిస్తుంటారు. అమ్మలక్కలు అట్టా ఇట్టా చూసి చెత్తాచెదారాన్ని పోస్తుంటారు. చిన్న పిల్లలు చొక్కా నిక్కరు విప్పి ఆ కాలువ గట్లమీద కూర్చుంటారు. కలిగినవాడు పెట్టే బాధల్ని లేనివాడు భరించినట్టు అన్నిటిని తమలో ఇముడ్చుకొంటాయి ఆ మురుగు కాలువలు. అయితే అప్పుడప్పుడు కసిదీర నసాళాలు అంటుకొనేటట్లు దుర్గంధాన్ని గుప్పించి కసితీర్చు కొంటుంటాయి!

మా ఇంటిముందు ఓ పిచ్చిది తిరుగుతూ ఉంటుంది.

మా ఇంటిముందు ప్రదేశానికి ఆ పిచ్చిదానికి ఏదో ఋణానుబంధం ఉన్నట్లుంది. నాలుగు గోడల మధ్య నగ్నంకోసం నాలుకలు తడుపుకొనే ప్రబుద్ధులు దిసమొలతో ప్రత్యక్షమవుతున్న పిచ్చిదానిని భరించలేక పోయారు. అక్కడినుండి దానిని తరిమికొట్టడానికి చాల ప్రయత్నాలు చేశారు. అది కూర్చున్నచోట మంచినీళ్ళు కుమ్మరించారు. ఉడుకునీళ్ళు చల్లారు. కొట్టారు. పెద్దలే ఇలా వ్యవహరించేసరికి పిల్లలు ఉడుకుమోతుతనంతో రాళ్ళు రువ్వారు. చిల్ల పెంకులు, గాజు పెంకులు విసిరారు. ఎంత చేసినా ఆ పిచ్చిది అక్కడి నుండి కదలలేదు. అంతటితో మా ఇరుగు పొరుగు వ్యర్థప్రయత్నాల జోలికి పోలేదు!

ఆ పిచ్చిది మా ఇంటి వాకిట మెట్లపై కూర్చుంటుంది. ఎదురుగా డాక్టర్ ఇంటి ముందర తిన్నెపై పడుకొంటుంది. లేకుంటే డాక్టర్ ఇంటికి సరిగ్గా తూర్పు దిక్కులో నాలుగో ఇంటి ముందు విశాలమైన రెండు తిన్నెలున్నాయి. ఆ తిన్నెల్ని ఆశ్రయిస్తుంది.

దాని తలలో కాకులు కాపురం పెట్టచ్చు. ఒంటిమీద జానెడు తుండుగుడ్డ అడ్డంగా ఉంటే ఉండచ్చు. లేకపోతే దానంతట అది ఊడిపడిపోవచ్చు. ఆ పిచ్చిదానికి ఆ ధ్యాసే ఉన్నట్లు కనిపించదు. నిద్రపడితే తిన్నెలమీదపడి నిద్రపోతుంది. లేకుంటే ఏ వాకిటిమెట్లమీదనో కూర్చుని

ఏదో చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు అర్థంకాని భాషలో వాగుతూ ఉంటుంది. ఉన్నట్లుండి నవ్వడం...కోపగించుకోవడం...మూతి బిగించి కూర్చోవటం...ఈలాంటి పిచ్చిచేష్టలన్నీ మామూలే!

ఎవరైనా ఎప్పుడైనా దాని మొగాన పిడికిడు కూడు విదిలించినట్లు కానీ అది తింటున్నట్లు కానీ నాకంట పడలేదు. ఆ మురుగు కాలువల్లో దిగుతుంది. దేవులాడుతుంది. కుళ్ళిందో చెడిందో చేతికి దొరికిన పండును తింటుంది. ఆ కాలువలో నీళ్ళే తాగుతుంది.

తన పిచ్చిలోకంలో తానొకమహారాణి. ఈ లోకం దృష్టికి అదొక అనాకారి. తన లోకమేదో తనకే కానీ ఈ లోకం సంగతి ఏమాత్రం పట్టింపులేదు. అందువల్ల పిల్లలు దానిని చూసి భయపడరు. అజాగ్రత్తగా ఉంటే ఏమైనా వస్తువులు పట్టుకొని పోతుందేమో? అని పెద్దవాళ్ళు సందేహ పడరు.

అలాంటి పిచ్చిది ఉన్నట్లుండి ఓ అర్ధరాత్రిపూట అరిచింది. 'అయ్యో! కుయ్యో!' అని గొంతుచించుకొని అరిచింది. 'ఏం జరిగిందో? ఏమో?' అని బద్ధకంగా లేచాను. ఒళ్ళు విరుచుకొంటూ నిద్రమత్తులో ఊగుతూ బయటికి వచ్చేసరికి గుంపుచేరిన మనుషులు తలకొక తీరుగా మాట్లాడుతున్నారు. కొందరు సానుభూతి చూపిస్తున్నారు. మరికొందరు 'ఛీ! ఛా!' అంటున్నారు.

ఎవడో రిక్షావాడు. వీధి విద్యుద్దీపకాంతుల్లో నగ్నంగా పడివున్న పిచ్చిదాన్ని చూశాడు. నడిరేయి. నరసంచారం లేదు. బలేమంచి చౌకబేరమని కక్కుర్తిపడ్డాడు. అది అరిచింది. వాడు బెదిరిపోయాడు. అంతలోనే ఇరుగు పొరుగు పోగయ్యేసరికి పారిపోయాడు.

ఆ రాత్రి పిచ్చిదానిమీద సానుభూతి కట్టలు తెంపుకొని ప్రవహించింది మా ఇరుగుపొరుగు వాళ్ళకు. ఇది మనుషుల్లో మానవత్వం ఇంకా మిగిలి ఉందనడానికి నిదర్శనం కావచ్చు!

ఓ మానవతి అప్పటికప్పుడే పాతచీర ఒకటి తెచ్చి చుట్టబెట్టింది. మరొక మగువ సగం చినిగిన రవికను తొడిగింది. ఇంకొక దయనిండిన గుండె కాకి గూటి తలను సరిచేయడానికి స్వయంగా పూనుకొనింది. ఇంతమంది ఇన్ని చేస్తుంటే ఆ పిచ్చిది కదిలీ మెదలకుండా కూర్చొనింది బొమ్మలా. 'ఫరవాలేదు. పిచ్చిదానికి కూడా మానభంగానికి మానసంరక్షణకు తేడా తెలిసినట్లుందే!' అనుకొన్నాను.

ఆసంఘటన జరిగిన నాటినుండి మా ఇరుగు పొరుగు హృదయాల్లో పిచ్చిది చోటు చేసుకొనింది. ఇప్పుడది సాధారణంగా వివస్త్రగా కనుపించడమే లేదని చెప్పాలి.

అయితే డాక్టరుగారికి మాత్రం పిచ్చి కోపం!

మురుగు కాలువల్ని సరిగా శుభ్రం చేయలేని మునిసిపాలిటీ వాళ్ళ మీదకాదు. మురుగు కాలువలో పారుతున్న నీటికి అడ్డంగా కుళ్ళిన పండ్లను చెత్తను కుమ్మరిస్తున్న పండ్ల వ్యాపారస్తులమీద కాదు. ముక్కులు పగిలేటట్లు దుర్గంధాన్ని వెదచల్లుతున్న మురుగు కాలువలమీద

అసలేకాదు. అయ్యో పాపం!– ఆ పిచ్చిదానిమీద! ఎందుకో? ఏమో? నా ఊహకుమాత్రం అందలేదు. నేను డాక్టరుగార్ని అడగలేదు. అయితే ఒకదినం వీధివాకిట్లో ఎదురుపడి–

"చూడండి. అసలు ఇలాంటి మనుషులు బతకడం దండగేకాదు. అపాయకరం కూడా. దానికేం? కుళ్ళిన పండ్లు తింటుంది. మురిగిన నీళ్ళు తాగుతుంది. ఉత్తరోత్తర దానికి సంక్రమించే రోగాలకు సంఘం బలి అవుతుంది!" డాక్టర్ నాతో అన్నాడు.

"డాక్టరుగారూ! మనం ఎన్నెన్నో ఆరోగ్యసూత్రాలను పాటిస్తున్నాం. అవసరమైనపుడు మందూ మాకు సరేసరి. కానీ ఏదో ఒక రోగం వద్దంటే వస్తూనే ఉంది. మరి ఆ పిచ్చిది మురుగు నీళ్ళు తాగుతూ కుళ్ళిన పండ్లు తింటూ దుక్కలా ఉంది గదండీ?" సందేహంగా అడిగాను.

"దాని శరీతత్త్వం సర్దుకుపోతూ ఉంది కాబట్టి ఇప్పుడు దుక్కలాగే కనిపిస్తుంది. ఆ తత్త్వం మారినపుడు అంటే దాని ఒంట్లో రోగ నిరోధకశక్తి తగ్గినపుడు అది అంటు వ్యాధులకు నిలయమవుతుంది. అపుడు రోగాన్ని అరికట్టడానికి ప్రయత్నాలు జరగవు. కానీ, వ్యాప్తి నిరాటంకంగా కొనసాగుతుంది."

"డాక్టరుగా మీ మాటలు సముచితంగాను ఆమోద యోగ్యం గాను ఉన్నాయి. నేను కాదనడం లేదు. అయితే ఈ సృష్టి అతి విచిత్రమయింది కదండీ! ఎవరెవరు ఎందుకిలా బతుకుతున్నారో? అసలు ఎందుకిలా అవుతున్నారో? అది అంతు తెలియని ఈ సృష్టిలో ఇలా ఎందుకు జరుగుతూ ఉందో నిర్ణయించడం చాలా కష్టం కదండీ?" నా అనుభవంతో శాస్త్రాన్ని ఎదుర్కోవాలని ప్రయత్నించాను.

"ఇదో ఈ ఇటువంటి మిడిమిడి జ్ఞానంతో ఇలాంటి పిచ్చి పిచ్చి వేదాంతాలు మాట్లాడే పిచ్చి మనుషులకు మనలో కొదవలేదు కాబట్టే ఈ సమాజం ఇలా అఘోరిస్తూ ఉంది" మొగం చిట్లించుకున్నాడు డాక్టర్.

"అయితే ఇలాంటి వాళ్ళని ఏం చేయాలంటారు?"

"ఏం చేయాలంటారా?..... ఏం చేయగలం మనం? వాళ్ళని బాగుపరిచే శ్రద్ధా ఓపిక మనకు గానీ మన ప్రభుత్వానికి గానీ లేవు కాబట్టి ఇలాంటి వాళ్ళను గప్‌చిప్‌గా లేపి పారేయడం మంచిది."

గతుక్కుమనింది నా గుండె!

డాక్టర్లు! ఎంతకైనా సమర్థులు. అలాంటి ఘోరం జరిగినా జరగవచ్చునేమో? అన్న సందేహం డాక్టర్‌గారి చూపుడు వేలై నన్నుభయపెడ్తూ ఉంటే– నేను డాక్టరుగారి మొగంలోకి సూటిగా చూడలేకపోయాను. అప్పటికి ఆ వాదాన్ని తుంచేశాను.

అయినా నేను గమనిస్తూనే ఉన్నాను. దాదాపు ఆ వీధి వాళ్ళందరికీ పిచ్చిదానిపట్ల సదభిప్రాయం కుదిరినా డాక్టర్ అభిప్రాయం మాత్రం మారలేదు. ఆయన కార్లో ఆస్పత్రికి పోతుంటాడు. వస్తుంటాడు. వస్తూపోతూ చూడకూడదనుకొంటూనే పిచ్చిదాన్ని చూస్తాడు. ఆ పిచ్చిది మురుగు కాలువలో వంగి దేనికోసమో దేవులాడుతూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ

కాలువలో చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యాయంగా పీక్కుతింటూ ఉంటుంది. శరీరం గుగుర్పొడుస్తుంది డాక్టర్ బాబుకు. మొగం చిట్లిస్తాడు. ముక్కుకు అడ్డంగా చేతిరుమాలు పెట్టుకొంటాడు. అడుగులు గబగబ ముందుకు వేస్తాడు ఆ దృశ్యాన్ని చూడలేనట్లుగా!

ఆదృశ్యం నాకంట పడినపుడంతా నాగుండె గుభిల్లుమనేది. అదొక పిచ్చిది. దానిలోకం దానిది. ఎవరి జోలికి రాదు. ఏమీ అడగదు. ఎవరినీ ఆశ్రయించదు. ఎప్పుడో దానివల్ల జరగబోయే ప్రమాదాన్ని ఊహించుకొని డాక్టర్ దాన్ని చంపేస్తే? ఏముంది? కాసంత సూదిమందు. ఒళ్ళు తెలియకుండా అది అరుగుమీద పడి నిద్రపోతుంటుంది. ఒకరికంట పడకుండా ఏ అర్ధరాత్రి పూటో దానికంత సూదిమందు ఎక్కిస్తే... అడిగే వాళ్ళెవరు? దానికోసం ఏడ్చే వాళ్ళెవరు? ఈ పవిత్ర భారతావనిలో ఇలాంటి అభాగ్యులెందరో? ఇలా ఆలోచిస్తూ ఉంటే ఎందుకో గుండె జాలితో నిండిపోతుంది.

ఓ రోజు రాత్రి ఇలాంటి ఆలోచనలతోనే పడుకొన్నానేమో? 'డాక్టర్!' అంటూ అరుస్తూ లేచాను అర్ధరాత్రి వేళలో. ఆ అరుపులకు శ్రీమతి ఎగిరిపడి లేచింది.

'ఏం జరిగిందండీ? ఎందుకు డాక్టర్! అని అరుస్తూ లేచారే?' అని ఆతురతగా అడుగుతూ ఉంది.

నేను నెమ్మదిగా లేచాను. వీధి తలుపు కొద్దిగా తెరిచి వీధికల్లా చూశాను. డాక్టర్ ఇంటి తిన్నె మీద పిచ్చిది ఆదమరిచి అస్తవ్యస్తంగా పడి ఉంది. ఎప్పుడూ లేనిది ఆ వేళప్పుడు డాక్టర్ ఇంట్లో దీపం వెలుగుతూ ఉంది! చిన్నపిల్ల ఏడుపు చెవుల్లో గంట కొట్టినట్లు వినిపిస్తూ ఉంది, ఆ నిశ్శబ్ద నిశీధిలో!...గుండె కుదటపడింది. తిరిగి తలుపు వేసుకొని ఇంట్లోకి వచ్చాను. కాసిని మంచినీళ్ళు గొంతులో పోసుకున్నాను. దడ తగ్గింది.

"ఏఁవండీ? ఏం జరిగిందండీ?" ఆమె అందోళన ఆమెది!

"ఎదురింట్లో డాక్టర్...."

"ఆఁ! ఎదురింట్లో డాక్టర్...." అసహనంగా నామాటను తుంచేసింది.

"ఎదురింట్లో డాక్టర్ పిచ్చిదాన్ని చంపేసేదానికి సూదిమందు తయారు చేసుకొన్నాడు రాజీ! అంతలోనే పసిపిల్ల కెవ్వుమని అరిచింది. పిల్లతల్లి ఎగిరిపడి లేచింది. లేకుంటే ఈనాటితో పిచ్చిదాని పని గోయిందా."

కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వింది మా శ్రీమతి.

"ఏం పిచ్చి మనుషులండీ మీరు. డాక్టరుగారికి పిచ్చిదానికి ఏం సంబంధం? ఆయన గంగిగోవులాంటి మనిషి. ఆయనెందుకు చంపుతాడండీ మీ పిచ్చిగానీ! పడుకోండి." అంటూ బలవంతంగా పడుకోబెట్టి దుప్పటి కప్పింది. పాడు కలలు దుప్పట్లో దూరవనుకొనిందేమో? పాడుకలలకు దుప్పటికి సంబంధం ఉందో ఏమోకానీ ఆమె దృష్టిలో– నా దృష్టికి ఎండకాలానికీ దుప్పటికి సంబంధం లేదు కాబట్టి పీకిపారేశాను కానీ డాక్టర్ గారి అభిప్రాయాన్ని మాత్రం దుప్పటిలాగా పీకి పారేయలేక పోయాను.

తెల్లారింది.

ఇలా తెల్లారడం మామూలేకదా?

మనిషి మనసు ఎప్పుడు ఎందుకు ఎలా మారుతుందో చెప్పలేము. ఎప్పుడు శృతి మించుతుందో ఏ అఘాయిత్యాని పాల్పడుతుందో చెప్పలేము. వాతావరణమూ అంతే! ఆ ఏడు ఏయేడు లేనంత విపరీతమయిన ఎండలు. రాయి రాయి రాజుకుంటే నిప్పు. కొంపలకు కొంపలే కాలిపోతున్నాయి. గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళుతున్నాయి. వడగాడ్పులకు జంతుజాలాదులు బలి అవుతున్నాయి. గుక్కెడు నీళ్లకోసరం జనం 'అలో రామచంద్రా' అని అలమటిస్తున్నారు. తాగడానికే నీళ్ళు కరువైనపుడు మురికి కాలువల సంగతి చెప్పాలా? చెత్తాచెదారం, కుళ్ళిన పండ్లు పేడా పెంటలకు నిలయమయ్యాయి. వాటిని తలుచుకొంటే ఒళ్ళు జలదరిస్తుంది. భరించడం మహాకష్టంగా తయారయింది.

దీనికితోడు పండ్లవీధిగా మారిన బండ్లవీధిలోకి మామిడిపండ్లు లారీలమీద వచ్చి దిగుతున్నాయి. లారీల రాకపోకలతో రాలిన చెత్తాచెదారంతో వీధి రొచ్చు రొచ్చుగా తయారయింది. కుళ్ళిన పండ్లను కొందరు ప్రబుద్ధులు అదేపనిగా కాలువల్లో కుమ్మరిస్తున్నారు. వాననీళ్ళో లేక ఇండ్లల్లో కుండా చట్టి కడిగిన నీళ్ళో ధారాళంగా ప్రవహిస్తుంటే కాలువల్లో దుర్గంధం ఎప్పటికప్పుడు కొట్టుకొని పోయేది. ఇప్పుడంతంత మాత్రంగా ఇండ్లల్లో నుండి కాలువల్ని చేరుతున్న కడుగునీళ్ళతో– చెత్తాచెదారం కుళ్ళిన పండ్లు మరింత కుళ్ళడానికి దోహదపడుతున్నాయి.

ఎండముంపు మురుగు కాలువల కంపు కలగలసి మా వీధిని వేధిస్తున్న ఓ రోజు మధ్యాహ్నం. చుట్టపురీతిగా పలకరించడానికి వచ్చినట్లు నాలుగు తొలకరి చినుకులు రాలాయి. అసలే రొచ్చు రొచ్చుగా ఉన్న నేల. చినుకులు పడడంతో కాలుపడితే జారుతుందన్నట్లుగా తయారయింది.

బాగా వర్షం కురిసి ఉంటే కాస్త చల్లబడి ఉండేది. కాలువలు కడిగి తోసినట్లయ్యేవి. కళ్ళాపుచల్లినట్లు చిలకరింపుతో లోపలివేడి లేపి కొట్టింది. గంట నాలుగయినా బయట అడుగు పెట్టాలంటే భయమేస్తూ ఉంది. కాస్త చల్లబడితే వెళ్ళ వచ్చులే! అని ఏదో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నా ఇంట్లోనే!

'అయ్యో బిడ్డ!!" 'అయ్యో బిడ్డ!!"– అన్న గావు కేక చెవుల్ని తూట్లుపొడిచింది.

"ఎవరిబిడ్డ? ఏమయింది బిడ్డకు?" అన్న ఆతురతతో ఎగిరిపడి లేచాను. వీధిలోకి వెళ్ళవలసిన వాడిని ఇంట్లో కలయచూశాను. బిడ్డలందరు ఇంట్లోనే ఉన్నారు. మనసు కుదుటపడింది. మనిషి ఎంత స్వార్థుడు? బిడ్డ అంటే– ఏ బిడ్డయినా బిడ్డేగదా? అని ఆలోచించ లేకపోయింది పిచ్చిమనసు! సరే నా బిడ్డలందరూ ఇంట్లోనే క్షేమంగా ఉన్నారు. అప్పుడు 'అయ్యో బిడ్డ!' సంగతి చూడాలికదా? అని వీధిలోకి వచ్చాను.

అప్పటికే కాలువచుట్టూ జనం గుమిగూడారు. కాలువ గట్టుమీద కాలు గాలిన పిల్లుల్లా తిరుగుతూ, 'అయ్యో! బిడ్డ!......అయ్యోబిడ్డ!" అంటున్నారు.

తప్పటడుగులు వేస్తూ వీధివాకిట్లోకి వచ్చిన డాక్టర్ గారి మూడేండ్ల ముద్దులపాప! ... ఎలా జారిపడిందో?– కాలువలో పడిపోయింది. కుళ్ళిన పండ్లు ...చెత్తా చెదారం.... పెంటతో మురుగుకాలువ రొచ్చురొచ్చుగా ఉంది. చూస్తే మూడురోజులు తిండి సహించదు. ఆ రొంపిలో బిడ్డ బోర్లపడి కూరుక పోయింది. గుక్కతిప్పుకోలేక అరుస్తూ ఉంది.

డాక్టర్ బాబుగారు వచ్చారు. వారి శ్రీమతి వచ్చింది. వీధిలో ఇరుగు పొరుగు వచ్చారు. అందరూ కలిసి 'అయ్యోబిడ్డ!' అయ్యోబిడ్డ!' అంటున్నారు. కాలువగట్టుమీద భరతనాట్యం చేస్తున్నారు. డాక్టరుగారు, వారి సతీమణి ముక్కుకు చేతిరుమాలు అడ్డంపెట్టుకోవడం అరక్షణం మానలేదు. అందరు నాగరికత ముసుగు తొడుక్కొన్న మనుషులే! అయితే చావు బతుకుల్లో ఉన్న ఆ బిడ్డను సంరక్షించడానికి ఎవరూ ముందు పడలేదు. ఆ బిడ్డమీది ఆశలు వదులుకోవలసి వచ్చేటట్లుంది. దిగుదామా? అని ప్రయత్నిస్తున్నాను. అంతలోనే ఎక్కడ ఉండిందో ఏమో ఆ పిచ్చిది? ఎవరో బొట్టుపెట్టి పిలిచినట్లు వచ్చింది. ఎడమచేత్తో ఆ బిడ్డను అవలీలగా ఎత్తి గట్టుమీద పెట్టింది. ఎవరివైపు చూడలేదు. ఏమీ పట్టించుకోలేదు. తనపని తనదన్నట్లుగా కాలువలో ఏదో దేవులాడుకొంటూనే ఉంది.

డాక్టర్ గారి భార్య బిడ్డను జవురుకొని లోపలికి పరుగెత్తింది!

“ఎక్కడుండిందో! ఏమో సమయానికి దేవతలాగా వచ్చి బిడ్డను కాపాడింది.”– గుమిగూడిన అమ్మలక్కలు పిచ్చిదాన్ని మెచ్చుకొంటున్నారు. ఈ మాటలకు చేతలకు అతీతంగా పిచ్చిది తనపని తనదిగా మురుగు కాలువలోనే!

మా శ్రీమతి దృష్టిలో నేను పిచ్చివాడిని. నా దృష్టిలో డాక్టర్ పిచ్చివాడు. లోకం దృష్టికి అది పిచ్చిది. ఆ మాటకొస్తే ప్రతి మనిషీ పిచ్చివాడే ఏదో ఒకసందర్భంలో!

చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యాయంగా పీక్కుతింటూ ఉంది మురికి కాలువలో పిచ్చిది!

'ఎవరెవరు? ఎందుకు? ఇలా బతుకుతున్నారో? అందులో అంత రార్థాలేమిటో? సృష్టి చిత్రం?' అని నేనెప్పుడో డాక్టరుగారితో అన్న మాటలు మళ్ళీ ఒకసారి మనసులో మెదిలాయి. డాక్టర్ వైపు చూశాను.

డాక్టర్ తల వంచాడు. అయినా అతని కనుకొలకుల్లో తిరిగిన కన్నీటి బిందువుల్ని నేను గమనించ లేకపోలేదు.

పాపం! పిచ్చిమనిషి!! ●

**ఆంధ్రపత్రిక**
(15, సెప్టెంబర్ 1978)
**ముత్యాలు - పగడాలు**
(మయూరి 11, ఆగస్టు 1995)